సాక్షి బాపట్ల

బుధవారం ၊ 28 ၊ ఆగస్టు ၊ 2024



మొక్కల పెంపకంపై స్థల పరిశీలన

ఫిరంగిపురం: 113త్యాళ్లూరు గ్రామంలో మొక్కల పెంపకం కోసం పలు ప్రభుత్వ స్థలాలను జెడ్పీ సీఈఓ వసంతరాయుడు, డీపీఓ శ్రీదేవి మంగళవారం పరిశీలించారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు నీటినిల్వ 45.46 టీఎంసీలకు చేరింది. ఎగువ నుంచి 45185 క్యూసెక్కులు చేరుతుండగా దిగువకు 57876 క్యూసెక్కులు వదులుతున్నారు.

మంగళ గౌరీగా బండ్లమ్మ దర్శనం



పిట్టలవానిపాలెం: చందోలు గ్రామంలో కొలువై ఉన్న బగళాముఖ అమ్మవారి దేవాలయంలో మంగళవారం హరిద్ర శృంగార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారిని మంగళగౌరీగా అలంకరించారు.

న్యూస్‌రీల్

తెలుగులో తీర్పు చెప్పిన న్యాయమూర్తి



తెనాలిరూరల్: తెలుగు భాషాదినోత్సవ వారోత్సవాల్లో భాగంగా తెనాలిలో న్యాయమూర్తి తెలుగులో తీర్పు చెప్పారు. తెనాలి ప్రిన్సిపల్ సివిల్ జడ్జి(జూనియర్ డివిజన్) పవన్‌కుమార్ ఓ కేసుకు సంబంధించిన తీర్పును తెలుగులో చెప్పారు. వేమూరి భిక్షాలు, వేజండ్ల విక్రమ్‌ల మధ్య ఆర్థిక లావాదేవీల కేసు నడుస్తోంది. కేసు మంగళవారం విచారణకు రావడంతో న్యాయమూర్తి పవన్‌కుమార్ సాక్ష్యాధారాలను పరిశీలించారు. భిక్షాలుకు విక్రమ్ రూ. 3,75,666 చెల్లించాలని తీర్పు తెలుగులో చెప్పారు. ఈ వారమంతా రోజుకో తీర్పు తెలుగులో చెప్పనున్నట్టు న్యాయమూర్తి తెలిపారు.


హెవీ మోటార్ డ్రైవింగ్ స్కూలులో 230మందికి శిక్షణ

17వ బ్యాచ్ శిక్షణకు దరఖాస్తు చేసుకోండి



నరసరావుపేట: స్థానిక ఆర్టీసీ డిపోలో ప్రభుత్వం నిర్వహిస్తున్న హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ స్కూలులో ఇప్పటివరకు 230మంది డ్రైవర్లకు శిక్షణ ఇచ్చినట్లు డిపో మేనేజర్ బత్తుల వీరాస్వామి మంగళవారం వెల్లడించారు. మంగళవారం డిపోలో 16వ బ్యాచ్ శిక్షణ పూర్తిచేస్తున్న 16మంది అభ్యర్థులకు సర్టిఫికేట్లు అందజేశారు. 17వ బ్యాచ్ శిక్షణ ప్రారంభం కాబోతుందని, దీనిలో చేరే లైట్ మోటార్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు సీట్లకోసం 7382896038, 7382896158, 9959225428 నంబర్లను సంప్రదించాలని కోరారు.

జీఎన్ఎం సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం



గుంటూరు మెడికల్: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్ఎం) సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం గుంటూరు వైద్య కళాశాలలో ప్రారంభం అయ్యాయి. ఉదయం 9 - మధ్యాహ్నం 12, మధ్యాహ్నం 2 - సాయంత్రం 5 గంటల వరకు జరిగాయి. సెప్టెంబర్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నాయి. జిల్లావ్యాప్తంగా అప్లై చేసుకున్నవారిలో 550 మంది రాగా, 30 మంది గైర్హాజరయ్యారు. చీఫ్ ఎగ్జామినర్‌గా జీజీహెచ్ సివిల్ సర్జన్, ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకట సతీష్‌కుమార్, అబ్జర్వర్‌గా నర్సింగ్ కళాశాల లెక్చరర్ వెంకట రమణ వ్యవహరిస్తున్నట్లు నర్సింగ్ స్కూల్ ప్రిన్సిపల్ సుజాతరాణి తెలిపారు.

14న జిల్లాలో 'జాతీయ లోక్ అదాలత్'

నగరంపాలెం: సెప్టెంబరు 14న జిల్లాలోని కోర్టు ప్రాంగణాల్లో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి వై.వి.ఎస్.బి.జి.పార్థసారథి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని కోసం జిల్లా అంతటా లోక్ అదాలత్ బెంచ్‌లను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కక్షిదారులు, పోలీసులు, స్టేక్ హోల్డర్లు ఎక్కువ కేసులు పరిష్కరించేలా సహకరించాలని పేర్కొన్నారు.

చందలూరు పాఠశాల జిల్లా క్రీడా ప్రతిభా అవార్డు

జే పంగులూరు: జిల్లా క్రీడా ప్రతిభా అవార్డుకి చందలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎంపికైనట్లు ఆ పాఠశాల హెచ్‌ఎం చందలూరి గిరిజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవార్డుకు రాష్ట్రంలోని 130 పాఠశాలలను ఎంపిక చేశారని, అందులో చందలూరు హైస్కూల్ ఉండటంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు. ప్రముఖ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా నేషనల్ స్పోర్ట్స్ డేని ఆగస్టు 29వ తేదీన దేశవ్యాప్తంగా జరుపుకుంటారని ఆమె తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం క్రీడా ప్రతిభా అవార్డులను, స్పోర్ట్స్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులను ప్రకటించినట్లు చెప్పారు. అవార్డుకు ఎంపికవడానికి కారణమైన వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రతిమను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, గ్రామ పెద్దలు అభినందించారు.



వైద్య సిబ్బందిపై దాడులు అమానుషం

వైద్య రంగంలో మహిళా సిబ్బందిపై అధికంగా పనిచేస్తున్నారు. వారితో గౌరవంగా వ్యవహరించాలి. ఇటీవల దాడులు ఎక్కువ అయ్యాయి. అకారణంగానే దాడులకు పాల్పడడం సిగ్గుచేటు. ప్రభుత్వం వారిని కాపాడటానికి ప్రత్యేక చట్టాలు తీసుకురావాలి. సేవా దృక్పథంతో పనిచేసే వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి. కోల్‌కతా లాంటి ఘటనలతో అందరిలో ఆందోళన నెలకొంది. వీటి నుంచి ధైర్యం కల్పించే చర్యలు ప్రభుత్వం తీసుకోవాలి.

-కేఈ విజయలక్ష్మి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, పీహెచ్‌సీ కొల్లూరు





మహిళలపై చులకన భావం వీడాలి..

మహిళా ఉద్యోగులపై సమాజంలో ఉన్న చులకన భావాన్ని ప్రతి ఒక్కరూ వీడాలి. ఓ మహిళ గౌరవ ప్రదమైన ఉద్యోగం చేస్తుందంటే సమాజంలో వారికి సరైన గౌరవాన్ని అందించాలి. మహిళా ఉద్యోగులకు ప్రభుత్వం కూడా సరైన రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలి. ఇప్పటికే ఆరోగ్య శాఖ సిబ్బంది ఆందోళనకు గురవుతున్నారు. కోల్‌కతా లాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి.

-టి.వసుధ, ఎంఎల్‌హెచ్‌పీ, రాజుబంగారుపాలెం, చినగంజాం పీహెచ్‌సీ

హైవే స్పీడుగా పనులు

రెండు రాష్ట్రాలు ఒక రోడ్డు

- వాడరేవు- పిడుగురాళ్ల హైవే
- మారనున్న రూపురేఖలు
- ముమ్మరంగా రోడ్డు నిర్మాణ పనులు
- 2025 డిసెంబర్ నాటికి నిర్మాణం పూర్తి లక్ష్యం
- రెండు రాష్ట్రాల మధ్య తగ్గనున్న దూరం

వాడరేవు- పిడుగురాళ్ల హైవే పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ హైవేతో జిల్లా రూపురేఖలు మారిపోనున్నాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య సత్సంబంధాలతో పాటుగా పర్యాటక రంగం, వ్యాపార రంగాలు అభివృద్ధిలో దూసుకెళ్లనున్నాయి. ఇప్పటికే ఈ ప్రాంతంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఊపందుకుంది. వచ్చే ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రహదారి రానుందని అధికారులు చెబుతున్నారు.





వాడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనులు ఇన్‌సెట్‌లో హైవే మ్యాప్‌ను పరిశీలించి అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ వెంకట మురళి(ఫైల్)

చీరాల: గత ప్రభుత్వ హయాంలో వాడరేవు- పిడుగురాళ్ల జాతీయ రహదారి నిర్మాణ పనులు చేపట్టింది. రోడ్డు నిర్మాణానికి ఆమోదం తెలపడంతో పాటుగా రూ.667 కోట్లు నిధులు కూడా విడుదల చేయించారు. ఈ రోడ్డు వాడరేవు నుంచి పర్చూరు, చిలకలూరిపేట, నరసరావుపేట మీదుగా నకరికల్లు అడ్డరోడ్డు వరకు 81.5 కిలోమీటర్ల మేర రహదారిని వెడల్పు చేసేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. వాడరేవు- పిడుగురాళ్ల వరకు 47 కిలోమీటర్ల వరకు నాలుగు వరసల జాతీయ రహదారిగా నిర్మాణాన్ని చేపట్టారు.

లక్ష్యం మేరకు పనులు

2025 డిసెంబర్ నాటికి ఈ రహదారి నిర్మాణ పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేలా అధికారులు, ప్రభుత్వం పనులు ముమ్మరం చేసింది. ఈ రహదారి నిర్మాణం కోసం 103 హెక్టార్ల భూమి అవసరం కాగా 22.30 హెక్టార్ల ప్రభుత్వ భూమిని కేటయించగా మిగిలిన 82.70 హెక్టార్లు భూమిని ప్రజల నుంచి సేకరిస్తున్నారు. ఈ రహదారి నాలుగు లైన్లతో నిర్మాణం చేపట్టనున్నారు. జాతీయ రహదారికి 167-ఏగా పేరు పెట్టారు. 24 మీటర్ల వెడల్పుతో ఏర్పాటు చేయనున్న రహదారికి ఆధునిక యంత్రపరికరాలతో పనులు చేయిస్తున్నారు.

బాపట్ల జిల్లా పరిధిలో..

ఈ రహదారి నిర్మాణంలో 37 కిలో మీటర్ల రోడ్డు బాపట్ల జిల్లా పరిధిలోనే ఉండటంతో జిల్లాకే తలమానికంగా మారనుంది. హైవే నిర్మాణం పూర్తయితే వినియోగంలోకి వస్తే జిల్లాకే మణిహారంలా ఉంటుందని చెబుతున్నారు. ఫలితంగా తెలంగాణ రాష్ట్రం హైదారాబాద్‌కు తక్కువ సమయంలో చేరుకోవడంతో పాటుగా తీరప్రాంతాలకు పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. అలానే ఈ హైవే నిర్మాణంలో భూములు కోల్పోయిన వారికి త్వరగా నష్ట పరిహారం అందించేందుకు అధికారులు అన్నీ చర్యలు తీసుకుంటున్నారు. నాణ్యత ప్రమాణాలు పాటించి రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు ఉన్నతాధికారులు నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అటు పర్యాటకరంగం, ఇటు రియల్ రంగం వృద్ధి చెందడంతో పాటుగా ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. చిన్న హోటళ్ల నుంచి పెద్ద రిసార్టులు, చిరు వ్యాపారులకు ఉపాధి అవకాశాలు పెరగనున్నాయి. చీరాల మండలంలోని వాడరేవు ప్రధాన రహదారిని వెడల్పు చేయడంతో పాటు నాలుగు మేజర్ బ్రిడ్జిలు, ఆరు అండర్ పాస్‌ల నిర్మాణ పనులు కూడా ప్రారంభించారు. జాతీయ రహదారి అందుబాటులోకి వస్తే చీరాలలో అన్నదాతలు పండించిన పంటల ఎగుమతులు పెరగడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు కేవలం నాలుగు గంటల్లోనే చేరుకోవచ్చు.

హైవేతో ఉపాధి అవకాశాలు

వాడరేవు-పిడుగురాళ్ల జాతీయ రాహదారి 167-ఏ వల్ల మత్స్యకారులకు ఎంతో ఉపయోగం. మత్స్య ఉత్పత్తుల ఎగుమతులకు ఎక్కువ అవకాశం ఉంది. ఎన్నో ఏళ్లుగా మత్స్య సంపద రవాణాకు చాలా ఇబ్బందులు పడుతున్నాం. త్వరలో రహదారి వినియోగంలోకి తీసుకువస్తుండటంతో పర్యాటకుల సంఖ్య పెరగడంతోపాటు మత్స్యకార గ్రామాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతాయి.

– ఎరిపెల్లి రమణ, మాజీ సర్పంచి, వాడరేవు

బరితెగింపు

టీడీపీ నేతల సాయంతో కోడిపందేలు

కొల్లూరు: అధికార పార్టీ నాయకులు బరితెగించారు. కోడి పందేలు యథేచ్ఛగా నిర్వహిస్తున్నారు. చట్టాన్ని తమ చుట్టంగా మార్చుకుని ఇష్టానుసారం వ్యవహరిస్తున్నారు. బాపట్ల జిల్లా కొల్లూరు మండలంలోని పలు గ్రామాలలో పంట పొలాలు, తుప్పలు వెంబడి కోడి పందేలు వేయడం సర్వసాధారణం. కానీ టీడీపీ నాయకులు మాత్రం కోడి పందేలకు 'బరి' ఏర్పాటు చేసి రూ.లక్షలకు లక్షలు సొమ్ము దండుకుంటూ జేబులు నింపుకునే పనిలో నిమగ్నమయ్యారు. మండలంలోని అనంతవరంలో టీడీపీ నాయకుడు భారీ ఎత్తున ఏర్పాట్లు చేసి నిరంతరం కోడి పందేల నిర్వహణకు ఏర్పాట్లు చేసి పందేలు నిర్వహిస్తుండగా, బొద్దులూరుపాడు, కొల్లూరు శివారు యాదవపాలేనికి చెందిన నాయకులు కోడిపందేల బరి ఏర్పాటు చేసి పందేలు వేస్తున్నారు. సోమవారం రాత్రి తెల్లవార్లు బొద్దులూరుపాడులో పెద్దఎత్తున పందేలు జరిగాయి. అదే విధంగా మండలంలోని గాజుల్లంక- పోతార్లంక గ్రామాల నడుమ జనసైనికులు కోడి పందేలు నిర్వహించి సొమ్ముచేసుకుంటున్నారు. పందేల ఎంట్రీ ఫీజు రూ.200 వసూలు చేస్తున్నారు. బరికి సుమారు 500 మంది హాజరవుతున్నారు. లక్షలాది రూపాయలు పందేలు జరుగుతున్నాయి. కోడి పందేలు ఇంత బాహాటంగా వేస్తున్నా పోలీసులు అటువైపు కన్నెత్తి చూడకుండా టీడీపీ నాయకులు పోలీసులను తమ కనుసన్నలతో శాసించడం, పోలీసులపైనా దౌర్జన్యానికి దిగి పందేలను నిరాఘటంగా నిర్వహిస్తున్నారు.

చిరుఉద్యోగుల జోలికొస్తే సహించం

- యానిమేటర్లను తొలగించటం సరికాదు
- డాక్టరు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టేందుకు సిద్ధం
- వరికూటి అశోక్‌బాబు

బాపట్ల: చిరుద్యోగుల జోలికొస్తే సహించేదిలేదని వైఎస్సార్ సీపీ వేమూరు నియోజకవర్గ సమన్వయ కర్త వరికూటి అశోక్‌బాబు హెచ్చరించారు. వేమూరు నియోజకవర్గంలో 40 మంది యానిమేటర్లు తొలగింపుపై డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పిచ్చిరెడ్డిని మంగళవారం కలసి వినతిపత్రం అందజేశారు. నిబంధనలకు విరుద్ధంగా చిరు ఉద్యోగులను తొలగించటం సరికాదని వినతిపత్రంలో పేర్కొన్నారు. గ్రూపు లీటర్లు మద్దతు లేకుండా ఏవిధంగా తొలగించారో చెప్పాలని ప్రశ్నించారు. రాజధాని నిర్మాణానికి అంటూ ఒక్కొక్కరి వద్ద అక్రమ వసూలు చేయటాన్ని అశోక్‌బాబు దుయ్యబట్టారు. యానిమేటర్ల రికార్డులు ఇవ్వాలంటూ కొంతమంది కూటమి పార్టీ నాయకులు ఒత్తిడి చేయటం దాడులకు పాల్పడటం సరికాదన్నారు. ఇప్పటికైన ఈదాడులు నిలుపుదల చేయకపోతే బాపట్లలోని డాక్టరు బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.



డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పిచ్చిరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న వరికూటి అశోక్‌బాబు

అన్న క్యాంటిన్ నిర్వహణ లోపం..

పేదోడికి ఐదు రూపాయలకే భోజనం అంటూ అన్న క్యాంటిన్లు ఏర్పాటు చేయటాన్ని స్వాగతిస్తున్నామని వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. ప్రభుత్వం తన నిధులతో భోజనం పెట్టాలని, చందాలతో, శుభ, అశుభ కార్యక్రమాలు అక్కడ చేసుకోవాలంటూ కూటమి నాయకులు చెప్పటం అన్నం తినేవారిన్ని అగౌరవ పరిచే విధంగా ఉందన్నారు. ప్రభుత్వం తన సొంత నిధులతో గౌరవప్రదంగా అన్న క్యాంటిన్లను నిర్వహించాలని సూచించారు. పేదలను అవహేళనగా చూస్తున్నారని దుయ్యబట్టారు. వినతి పత్రం ఇచ్చినవారిలో ఎంపీపీ డి.వెంకట లలితకుమారి, నాగమల్లేశ్వరావు ఉన్నారు.

కుందేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: కుందేరు వాగుపై బ్రిడ్జి నిర్మాణం కోసం ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. బాపట్ల మండలం కావూరివారిపాలెం వద్ద కుందేరు వాగుపై ఉన్న బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మతో కలసి మంగళవారం పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ కావూరివారిపాలెం ప్రజలకు అవసరమైన బ్రిడ్జి నిర్మించడానికి అన్ని చర్యలు తీసుకుంటామని చెప్పారు. 118 సర్వేనెంబర్ లోని భూమిలో బ్రిడ్జి ఉండడంపై ఆరా తీశారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో దానిని తొలగించి అదే ప్రాంతంలో నూతనంగా బ్రిడ్జి నిర్మించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామన్నారు. రూ.ఐదు కోట్ల నిధులతో ప్రాథమికంగా అంచనాలు వేసి ప్రభుత్వానికి నివేదించామని వెల్లడించారు. ఆర్ అండ్ బీ ఆధీనంలో బ్రిడ్జి నిర్మించాల్సి ఉందని వివరించారు. కుందేరు వాగు ఆక్రమణలకు గురి కావడం, వాగు భూమిలోనే కొందరు వ్యక్తులు పంటలు సాగు చేయడంపై కలెక్టర్ ఆరా తీశారు. వాగు పరీవాహక ప్రాంతం ఆక్రమణలకు గురి కాకుండా సర్వే చేసి సరిహద్దు రాళ్లు వేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. అనంతరం రాయల్ మెరైన్ రొయ్యల ఫ్యాక్టరీని పరిశీలించారు. అక్కడ నుంచి ఎగుమతి అవుతున్న రొయ్యల సరుకు వివరాలను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఆయన వెంట ఆర్డీఓ జి.రవీందర్, జలవనరుల శాఖ ఈఈ మురళీకృష్ణ, డీఈ సుబ్బారావు ఉన్నారు.



కుందేరు వాగుపై మ్యాప్‌ను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

నేత్రదానం చేయండి చిరంజీవులు కండి

బాపట్ల: నేత్రదానం చేయండి చిరంజీవులు కండంటూ జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి పేర్కొన్నారు. 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్‌లో బ్యానర్, నేత్రదాన ప్రతిజ్ఞ పత్రం, నేత్రదాన అవగాహన పత్రాన్ని మంగళవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు మరణానంతరం నేత్రదానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బాపట్ల జిల్లా ఆరోగ్య అధికారి విజయమ్మ, జిల్లా లెప్రసి నివారణ అధికారి రమాదేవి పాల్గొన్నారు.

అత్యాశకు యాప్ వల..!

- వీసీఐ యాప్ వలలో చిక్కుకున్న వందల మంది
- అత్యాశకు పోయి రూ.లక్షల్లో ఉత్పత్తుల కొనుగోలు
- రోజువారీగా జమైన నగదు విత్‌డ్రా ఆప్షన్ నిలిపివేత
- రూ.80 లక్షల వరకు మోసపోయిన ప్రత్తిపాడు వాసులు

ప్రత్తిపాడు: ఎంత మంది ఎన్ని చెప్పినా జనం మాత్రం చెవికెక్కించుకోరు. ఈజీ మనీ కోసం అత్యాశకు పోతుంటారు. ఆన్‌లైన్ మోసాల కోరల్లో చిక్కుకుంటారు. నిలువునా మోసపోయి నెత్తీనోరూ బాదుకుంటారు. చివరకు జేబులకు చిల్లు పెట్టుకుని లబోదిబోమంటూ విలపిస్తుంటారు. అలాంటి ఘటనే ప్రత్తిపాడులో చోటుచేసుకుంది. వందల మంది యువకులు ఓ ఆన్‌లైన్ యాప్ వలలో చిక్కుకున్నారు. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి రూ.లక్షల్లో సంపాదించుకోవాలని యత్నించి నష్టపోయారు. వీసీఐ షాప్ అనే పేరుతో ఉన్న ఓ లింక్‌ను ఓపెన్ చేసి యాప్ ఇన్‌స్టాల్ చేసుకున్నారు. పెట్టుబడి పెట్టినా, ప్రొడక్టులు కొనుగోలు చేసినా అత్యధికంగా డబ్బులు వస్తున్నాయని నమ్మారు. రూ.500 నుంచి రూ.లక్ష వరకు పెట్టుబడి పెడితే ప్రతి రోజు ఆదాయం వస్తుందని యాప్‌లో చూపారు. గుడ్డిగా నమ్మారు ప్రజలు. ప్రొడక్టులు కొని ఇప్పుడు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు.

రూ. 500 చెల్లిస్తే యాప్‌లోకి ..

యాప్‌లో పలు ఉత్పత్తులను రకరకాల ఆకర్షణీయమైన ఆఫర్లతో అందుబాటులో ఉంచారు. ప్రొడక్టు కొనుగోలు చేస్తే రోజుకు కొంత నగదు చొప్పున కొన్ని రోజులపాటు యాప్‌లోని వ్యాలెట్‌కు జమ అవుతాయని, ఆ నగదును విత్‌డ్రా చేసుకోవచ్చనేది ఆ యాప్ సారాంశం. తొలుత చేరాలంటే సభ్యులు రూ. 500 చెల్లించాలి. తర్వాత ప్రాసెస్ జరుగుతుంది. ఉత్పత్తులు రూ. 500 నుంచి రూ. లక్ష వరకు ఉంటాయి. ఉదాహరణకు రూ.77 వేలు చెల్లించి ఒక ఉత్పత్తి కొంటే 78 రోజులపాటు రోజుకు రూ. 8,470 చొప్పున రూ.6,60,660 వస్తాయని యాప్‌లో ఆఫర్ కింద చూపారు. ఇలా రకరకాల ఆఫర్లతో ప్రొడక్టులు ఉంటాయి. తొలుత కొద్ది రోజులు సక్రమంగానే ఉత్పత్తులు కొనుగోలు చేసిన వారి వ్యాలెట్‌కు డబ్బులు జమ అయ్యాయి. వారం రోజులుగా యాప్‌లో విత్ డ్రా ఆప్షన్‌ను నిలిపి వేశారు. దీంతో బాధితులంతా బోరుమంటున్నారు. నిర్వాహకులు మరో యాప్‌ను సిద్ధం చేశారు. పాత యాప్‌లో పెట్టుబడులు పెట్టిన వారు ఇందులోనూ ఉత్పత్తులు కొంటే పాత దాంట్లోని నగదు విడతలవారీగా ఇస్తామంటూ మరో మోసానికి తెరలేపారు.

అప్పులు చేసి మరీ...

బాధితుల్లో ఎక్కువమంది యువత, ఆటోవాలాలు, చిరు ఉద్యోగులే. డబ్బులు ఆశ చూపించడంతో వడ్డీలకు అప్పులు చేసి మరీ పెట్టుబడులు పెట్టారు. ప్రత్తిపాడులోని ఓ బంకులో పనిచేస్తున్న యువకుడికి పెద్ద మొత్తంలో డబ్బులు ఈ యాప్ ద్వారా వచ్చాయన్న ప్రచారంతోపాటు ఆ డబ్బుకు తనది పూచీ అని అతడిచ్చిన భరోసా కారణంగా వందల మంది ఈ ట్రాప్‌లో చిక్కుకున్నారు. ఇప్పుడు వారి పరిస్థితి దారుణంగా ఉంది. ఒక్క ప్రత్తిపాడులోనే రూ. 60 లక్షల నుంచి రూ.80 లక్షల వరకు ఈ యాప్‌లో పెట్టినట్లు సమాచారం

గంజాయి... ఇసుక అక్రమ రవాణాను కట్టడి చేయాలి

- విగ్రహ కమిటీలు ఏర్పాటు చేయాలి
- ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో సీసీ కెమెరాలు
- కేసుల విచారణ వేగవంతం చేయండి
- రోడ్డు ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు
- నేరసమీక్ష సమావేశంలో ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్ల టౌన్: గంజాయి.. మద్యం.. ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో కట్టడి చేయాలని ఎస్పీ తుషార్‌డూడీ ఆదేశించారు. జిల్లా క్యాంప్ కార్యాలయంలో నేర సమీక్ష సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఎస్పీ మాట్లాడుతూ చర్యల్లో భాగంగా విజిబుల్ పోలీసింగ్ నిర్వహించాలని కోరారు. అందులో క్షుణ్ణంగా వాహన తనిఖీ చేపట్టాలని పేర్కొన్నారు. సమన్వయంతో సమర్థంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతివారం ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను పటిష్టంగా అమలు చేయాలని చెప్పారు. బహిరంగ ప్రదేశాల్లో, నిర్మానుష్య ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. 'పల్లెనిద్ర'తో ప్రజలకు మరింత చేరువ కావొచ్చన్నారు. ప్రజలు వారి సమస్యలను స్వేచ్ఛగా, నిర్భయంగా వెల్లడించడానికి అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు.



సీసీఎస్ డీఎస్పీకి ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఎస్పీ తుషార్‌డూడీ

సీసీ కెమెరాలు ఏర్పాటు..

పోలీస్ స్టేషన్ పరిధిలోని ముఖ్యమైన ప్రదేశాల్లో, కూడళ్లలో, దేవాలయాలు, మసీదులు చర్చిలు ఇతర ప్రధాన మందిరాల వద్ద, ముఖ్యమైన విగ్రహాలు ఉన్న ప్రదేశాల్లో తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్పీ కోరారు. గ్రామాలు, పట్టణాల్లో ఉన్న రాజకీయ నాయకులు, స్వాతంత్ర సమరయోధుల విగ్రహాల పర్యవేక్షణకు ప్రతి విగ్రహానికి ఒక కమిటీని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు తీసుకోవాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న కేసుల విచారణ వేగవంతం చేయాలని చెప్పారు.

వినాయక విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి..

వినాయక చవితి సందర్భంగా వినాయకుని ప్రతిమలను ఏర్పాటు చేసుకునేవారు పోలీస్ శాఖ నుంచి కచ్చితంగా అనుమతి పొందాలని ఎస్పీ సూచించారు. ఉత్సవాలు, ఊరేగింపులు చేసుకునేవారు కూడా అనుమతి తీసుకోవాలన్నారు. అనంతరం ఆలయ హుండీ, ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేసి 6.7 కేజీల వెండి, 10 ద్విచక్ర వాహనాలను రికవరీ చేయడంలో విశేష కృషి చేసిన సీసీఎస్ డీఎస్పీ పి.జగదీష్ నాయక్, సీసీఎస్ సీఐ పి.ప్రేమయ్య, ఐటీ కోర్ ఎస్ఐ నాయబ్ రసూల్, చుండూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ రాజ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ టి.సూర్యప్రకాష్, సీసీఎస్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ పి.వెంకటేశ్వర్లు, కానిస్టేబుళ్లు కె.చిరంజీవి, సిహెచ్.నవీన్, బి.వాసు, ఎస్.కోటేశ్వర రెడ్డి, ఐటీ కోర్ కానిస్టేబుల్ కె.రాములను అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమీక్ష సమావేశంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, రేపల్లె, బాపట్ల, సీసీఎస్ డీఎస్పీలు టి.మురళీకృష్ణ, జి.రామాంజనేయులు, పి.జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ ఎస్.చంద్రమోహన్, ఎస్బీ సీఐ జి.నారాయణ, డీసీఆర్‌బీ సీఐ బాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

డిమాండ్ల పరిష్కారం తర్వాతే పనులు

- నకరికల్లు – చీరాల హైవే పనులు అడ్డుకున్న రైతులు
- మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం అందించాలని ధర్నా

నరసరావుపేట రూరల్: నకరికల్లు – చీరాల వాడరేవు రోడ్డు పనులను రైతులు అడ్డుకొన్నారు. తమ డిమాండ్లు పరిష్కరించిన తరువాతే పనులు ప్రారంభించాలని నరసరావుపేట- నకరికల్లు రోడ్డులో ధర్నా నిర్వహించారు. రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న నాలుగు గ్రామాల రైతులు ధర్నాలో పాల్గొన్నారు. నకరికల్లు – చీరాల వాడరేవు రోడ్డు నిర్మాణంలో భాగంగా రెవెన్యూ అధికారులు మంగళవారం మండలంలోని రావిపాడు వద్ద కొలతలు తీసి మార్కింగ్ ఇచ్చే పనులు చేపట్టారు. ఈ పనులను రావిపాడు, ఇస్సప్పాలెం, జొన్నలగడ్డ, కేసానుపల్లి గ్రామాలకు చెందిన రైతులు అడ్డుకున్నారు. మార్కింగ్ వేసేందుకు వచ్చిన సిబ్బందితో వాగ్వివాదానికి దిగారు.



రావిపాడు వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

రక్షణ చట్టాలు అవసరం



మహిళలకు రక్షణ చట్టాలు అవసరం. ఇలాంటి సంఘటనలు మహిళల్లో మరింత అభద్రతాభావం కలుగజేయటమే కాకుండా భయభ్రాంతులకు గురయ్యే పరిస్థితి. ఉద్యోగం నరక ప్రాయం కాకూడదు. సహోద్యుగులు, విధులు నిర్వహించే ప్రాంతం స్నేహ పూర్వక వాతావరణం ఉన్నప్పుడే ఉద్యోగం స్వేచ్ఛగా చేయగలుగుతాం. అలాంటి వాతావరణం మహిళకు కల్పిస్తే ముందుకు పోగలుగుతాం. ఆటంకాలు ఎదురైతే విధులు నిర్వహించడం అసాధ్యమవుతుంది. –పెనుమాక శాంతి, స్టాఫ్ నర్స్, చినగంజాం పీహెచ్‌సీ



మహిళలకు భరోసా కల్పించాలి



ఆధునిక యుగంలో అన్ని రంగాలలో పురుషులతో సమానంగా మహిళలు రాణించాలని ప్రభుత్వాలు ఎంతో ప్రచారం చేస్తున్నాయి. క్షేత్రస్థాయిలో కూడా ఆ దిశగా చర్యలు చేపట్టాలి. నేరాలకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి మహిళలకు భరోసా కల్పించాలి. ఎంతో భవిష్యత్తు ఉన్న కోల్‌కతా యువతి ఇంత దారుణంగా ప్రాణాలు కోల్పోవాల్సి రావడం అత్యంత బాధాకరం. ప్రభుత్వాలు ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలి. – డాక్టర్ రాజేష్, మెడికల్ ఆఫీసర్, యర్రబాలెం

క్లుప్తంగా

క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం

జిల్లా ప్రాధికార సంస్థ అధికారి పాల్‌కుమార్



బాపట్లటౌన్: క్రీడలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని జిల్లా ప్రాధికార సంస్థ అధికారి పాల్‌కుమార్ తెలిపారు. జిల్లాలోని క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం క్రీడలపై జిల్లాలోని విద్యార్థులకు అవగాహన కల్పించారు. క్రీడా సంబరాల్లో భాగంగా మంగళవారం విద్యాసంస్థల్లో విద్యార్థులతో ఫిట్ ఇండియా ప్రతిజ్ఞ చేయించారు. చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించే విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు.

మెరుగైన సౌకర్యాలు కల్పించాలి



బాపట్ల: విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాల రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు బత్తుల పద్మావతి తెలిపారు. ఇటీవల సూర్యలకంలోని కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులు అస్వస్థతకు గురికావటంతో అక్కడ ఉన్న సౌకర్యాలపై మంగళవారం పరిశీలించారు. విద్యార్థులు తీసుకుంటున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఆమె వెంట గుంటూరు సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ప్రమీల, ఐసీడీఎస్ పీడీ ఉమా, సీడీపీఓ పార్వతి ఉన్నారు.

పక్కా గృహాలు మంజూరు చేస్తాం

హౌసింగ్ పీడీ ప్రసాద్

కర్లపాలెం: అగ్ని ప్రమాదంలో గృహాలు దగ్ధమైన కుటుంబాలకు పక్కా గృహాలు మంజూరు చేయనున్నట్లు హౌసింగ్ పీడీ జేఎస్‌కేఆర్‌కేవీ ప్రసాద్ తెలిపారు. సోమవారం లంక కాలువ కట్టపై దగ్ధమైన గృహాలను పరిశీలించి బాధితులను పరామర్శించారు. ఆయన మాట్లాడుతూ గృహాలు దగ్ధమైన కుటుంబాలలో ఇప్పటికే కొంతమందికి జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాలు ఇచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని స్థలాలు రాని వారికి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరవుతాయని తెలిపారు. బాధితులను పరామర్శించిన అనంతరం హౌసింగ్ పీడీ జగనన్న కాలనీని సందర్శించి బాధితులకు పక్కా గృహాలు నిర్మించేందుకు అవసరమైన స్థలాలను పరిశీలించారు. కార్యక్రమంలో హౌసింగ్ డీఈ కె.శ్రీనివాసరావు, ఏఈ అన్వర్‌బాషా, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ హనుమంతరెడ్డి పాల్గొన్నారు.



అగ్ని ప్రమాద బాధితులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ ప్రసాద్

చందోలులో మూడు పూరిళ్లు దగ్ధం

పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు శివారు ఎస్టీ కాలనీలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మూడు పూరిళ్లు ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్టీ కాలనీకి చెందిన తుమ్మా సుభద్ర, నంబూరి శ్రీకన్య, బళ్లమ్మలకు చెందిన ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. స్థానికుల సాయంతో మంటలను అదుపు చేశారు. టీడీపీ మండల కన్వీనర్ ఎండీ అఫ్జల్ బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.5 వేల చొప్పున అందజేశారు. పిట్టలవానిపాలెం తహసీల్దార్ మెహర్‌కుమార్ బాధిత కుటుంబానికి 20 కిలోల బియ్యం, కందిపప్పు, నూనె ప్యాకెట్లతో పాటు రూ.5 వేల నగదు అందజేశారు. బాధితులను జనసేన బాపట్ల నియోజకవర్గ సమన్వయ కర్త నామన శివన్నారాయణ, మండల కన్వీనర్ దాదా, రజాక్ పలువురు పరామర్శించారు.



అగ్ని ప్రమాద బాధితులకు సాయం చేస్తున్న తహసీల్దార్ మెహర్‌కుమార్

కట్టెలలోడు ట్రాక్టర్ బోల్తా.. ఒకరి మృతి



కొరిశపాడు వద్ద బోల్తాపడిన కట్టెల లోడు ట్రాక్టర్



టాక్టర్ కింద పడి మృతి చెందిన నాగేశ్వరరావు

మేదరమెట్ల: కట్టెల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడటంతో ఓ వ్యక్తి మృతి చెందగా మరొకరికి స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం రాత్రి 10 గంటలకు మండల కేంద్రమైన కొరిశపాడులో చోటు చేసుకుంది. వివరాలు.. కట్టెల లోడుతో ట్రాక్టర్ బొప్పూడి నుంచి కొరిశపాడుకు వెళ్తోంది. ఈక్రమంలో గ్రామంలోకి వచ్చేసరికి అదుపు తప్పి పంటపొలాల్లో బోల్తా పడింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న నలుగురు కట్టెల కింద పడిపోగా స్థానికులు వారిని బయటకు తీశారు. వారిలో ఒకరికి గాయాలు కాగా ఒకరు మృతి చెందాడు. మరో ఇరువురికి ఎలాంటి గాయాలు కాలేదు. మృతి చెందిన వ్యక్తి పేరు నాగేశ్వరరావు (60)గా గుర్తించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విజ్ఞాన్ నిరుల విద్యార్థిని

గుంటూరు రూరల్: రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు తమ కళాశాల విద్యార్థిని ఎంపికవ్వటం ఎంతో సంతోషంగా ఉందని విజ్ఞాన్ నిరుల మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి. రాధిక తెలిపారు. మంగళవారం పెదపలకలూరు గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపల్ మాట్లాడారు. బీటెక్ తొలి ఏడాది విద్యార్థిని షేక్ షేహనాజ్‌బీ జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో అండర్ 20 విభాగంలో ప్రథమస్థానంలో నిలిచిందన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయినట్లు తెలిపారు. చదువుతోపాటు క్రీడలలో కూడా విద్యార్థినులు రాణించటం గర్వంగా ఉందన్నారు. షేహనాజ్‌బీని కళాశాల బీఎస్ అండ్ హెచ్ విభాగాధిపతి డాక్టర్ టీవీఎస్ ప్రసన్న, పీడీ కిషోర్‌కుమార్, కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు అభినందించారు.



షేక్ షేహనాజ్‌బీని అభినందిస్తున్న దృశ్యం

ఆన్‌లైన్‌లో మాత్రమే దరఖాస్తు చేయాలి

గుంటూరు మెడికల్: ప్రైవేటు ఆసుపత్రులు, ల్యాబ్‌లు, స్కానింగ్ సెంటర్ల రెన్యువల్, కొత్త రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్‌లో మాత్రమే చేసుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి పేర్కొన్నారు. సంబంధిత డాక్యుమెంట్లు అప్లోడ్ చేసుకోవాలన్నారు. ప్రతి ఐదు సంవత్సరాలకు తప్పనిసరిగా రెన్యువల్ చేసుకోవాలని వెల్లడించారు. రిజిస్టర్ చేయించుకోకుండా నడిపితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని, ఆ సెంటర్లను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

ఫోన్లకు దూరమై పుస్తకాలకు దగ్గరవ్వాలి

ఏపీ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి నరసింహారావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు స్మార్ట్‌ఫోన్లకు దూరంగా ఉంటూ పాఠ్య పుస్తకాలతో గడపడం ద్వారా జీవితంలో లక్ష్యాన్ని చేరుకోగలరని ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల సంస్థ కార్యదర్శి రాసంశెట్టి నరసింహారావు అన్నారు. వెంగళరావునగర్‌లోని నగరపాలక సంస్థ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో ఆధ్వర్యంలో మదర్ థెరిసా జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నరసింహారావు విద్యార్థినులకు దిశా నిర్దేశం చేశారు. స్మార్ట్‌ఫోన్లను చాలామంది బానిసలుగా మారిపోతున్నారని అన్నారు. గేమ్స్ కారణంగా మానసిక సమస్యల బారిన పడుతున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. వీటిని జయించిన వారే చదువులోను, ఉద్యోగంతోపాటు జీవితంలోనూ రాణిస్తారని తెలిపారు. లయన్స్‌క్లబ్ ఆఫ్ గుంటూరు జయహో అధ్యక్షుడు ముట్లూరు వెంకయ్య మాట్లాడుతూ.. మదర్ థెరిసా జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు చిత్రలేఖన, వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ప్రతిభవంతులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పి.రమేష్, క్లబ్ సభ్యులు గోపిదేసి మల్లికార్జునరావు, మల్లికార్జున, పాఠశాల యాజమాన్య కమిటీ వైస్ చైర్మన్ జంగం జాషువా, సభ్యులు ఆరుమల్ల చెంచు, షేక్ జరీనా, మురికిపూడి దీప్తి, చిందు నరేష్ కుమార్, వై.పవన్‌కుమార్, తాడిగిరి పీటర్‌పాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మదర్ థెరిసా వేషధారణలోని చిన్నారులతో నరసింహారావు, హెచ్‌ఎం రమేష్ తదితరులు

తొలిదశలోనే క్యాన్సర్ గుర్తింపునకు టెక్నాలజీ

ఎయిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ రేఖపల్లి రాజశేఖర్

తాడేపల్లి రూరల్: క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించే టెక్నాలజీ త్వరలో భారత్‌లో అందుబాటులోకి రానుందని మంగళగిరి ఎయిమ్స్ న్యూరో సర్జన్ డాక్టర్ రేఖపల్లి రాజశేఖర్ అన్నారు. మంగళవారం తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరంలోని కేఎల్ యూనివర్సిటీలో జాతీయస్థాయి ట్రెండ్స్ ఇన్ ఎపిజెనిక్స్ ఇన్ క్యాన్సర్ డయాగ్నోసిస్, థెరపీ పేరుతో నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. క్యాన్సర్‌ను నిర్మూలించడానికి దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు పరిశోధనలు చేస్తున్నారని తెలిపారు. ముఖ్యంగా బయోటెక్నాలజీతో కృత్రిమ మేధస్సును అనుసంధానం చేయడం ద్వారా రక్తంలో క్యాన్సర్ కణాలు ముందుగానే గుర్తించి రోగుల ప్రాణాలను కాపాడేందుకు భారత్‌లో శాస్త్రవేత్తలు స్వదేశీపరిజ్ఞానంతో నూతన టెక్నాలజీకి శ్రీకారం చుట్టనున్నట్లు ఆయన వెల్లడించారు. వర్సిటీ ప్రో చాన్సలర్ డాక్టర్ కెఎస్ జగన్నాథ రావు మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా శాస్త్రవేత్తలను, ఇండస్ట్రీ భాగస్వాములను, విద్యార్థులకు ఒకే వేదికపైకి చేర్చామని అన్నారు. తద్వారా క్యాన్సర్‌పైన జరుగుతున్న పరిశోధనలలో మంచి ఫలితాలను రాబట్టవచ్చునని అన్నారు. 2023 ఐసీఎమ్మార్ నివేదిక ప్రకారం రానున్న కాలంలో క్యాన్సర్ వృద్ధి రేటు గణనీయంగా పెరుగుతుందని అన్నారు. సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం. జానకిరామయ్య మాట్లాడుతూ క్యాన్సర్‌ను సమూలంగా నిర్మూలించాలనే కార్యాచరణతో ఎఎస్‌ఆర్‌ఎఫ్, కేంద్ర పరిశోధనా సంస్థ అయిన సెర్బ్ ఆర్థిక సహకారంతో ఈ జాతీయ సదస్సును నిర్వహించామన్నారు. మద్రాస్ ఐఐటీ ప్రొఫెసర్ డాక్టర్ రాయల సురేష్ కుమార్ మాట్లాడుతూ... క్యాన్సర్ బయో మార్కర్ల గురించి వివరించారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో చాన్సలర్లు డాక్టర్ కె.ఎస్. జగన్నాథరావు, డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, అకడమిక్స్ డాక్టర్ కె. రాజశేఖరావు, డాక్టర్ ఎన్. వెంకట్‌రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం డీన్ డాక్టర్ కె.ఆర్.ఎస్. ప్రసాద్, ప్రముఖ శాస్త్రవేత్త డాక్టర్ అంజనాదేవి (హైదరాబాద్), డాక్టర్ షేక్ నౌషద్, సదస్సు కన్వీనర్ డాక్టర్ ఎం. జానకి రామయ్య, బయో టెక్నాలజీ విభాగాధిపతి, కో కన్వీనర్ డాక్టర్ ప్రవీణ్ కుమార్, కోశాధికారులు కోటేశ్వరరెడ్డి, జ్ఞానశేఖరన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో ప్రసంగిస్తున్న రాజశేఖర్

మహిళలతో మర్యాదగా మెలగాలి


నగరంపాలెం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్ల (పీఎస్)కు వచ్చే మహిళా ఫిర్యాదిదారులతో గౌరవంగా మెలగాలని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. జిల్లాలోని పలు పీఎస్‌ల్లో ఐదేళ్ల పూర్తయిన కానిస్టేబుళ్లకు రెండో విడత బదిలీల కౌన్సెలింగ్ పక్రియ మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని సమావేశ మందిరంలో నిర్వహించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళల అర్జీలను ఆలకించి, న్యాయం చేకూరేలా చూడాలని అన్నారు. పీఎస్‌ల్లోని సహచర సిబ్బందితో కుటుంబ సభ్యుల వలె విధులు నిర్వహించాలని చెప్పారు. స్టేషన్ పరిధిలో ఎల్‌అండ్ ఓ, క్రైం, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టిసారించాలని అన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలని, దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. సమావేశంలో జిల్లా ఏఎస్పీలు జీవీ.రమణమూర్తి (పరిపాలన), వెంకటేశ్వరరావు (సెబ్), ఎస్బీ సీఐల అళహరి శ్రీనివాసరావు, ఆనంద్, డీపీఓ ఏఓ వెంకటేశ్వరరావు, సిసి ఆదిశేషు, ఏఆర్ అడ్మిన్ ఆర్ఐ.బ్రహ్మానందం పాల్గొన్నారు.



కానిస్టేబుల్‌తో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

ఇల్లు కూల్చిన టీడీపీ నేతలపై చర్యలు తీసుకోవాలి

– కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



నరసరావుపేట: గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓటు వేశారనే కారణంతో చిలకలూరిపేట మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల ఏడుకొండలు ఇల్లు కూల్చి కులం పేరుతో దూషించిన టీడీపీ వర్గీయులపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్) రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం కేఎన్‌పీఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట బాధితులు ధర్నా చేశారు. నిందితులకు వత్తాసు పలుకుతున్న చిలకలూరిపేట రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కృష్ణ మాట్లాడుతూ యడవల్లి గ్రామంలో ఎరుకల కులానికి చెందిన ఏడుకొండలు ఇంటిని పొక్లెయిన్‌తో కూల్చి అనంతరం ఇంటి శిథిలాలను ట్రాక్టర్‌లో వేసుకుని ఊరు చివర ఉన్న వాగులో పడేసిన తన్నీరు గోవిందరాజు అతని బంధువులను ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద వెంటనే అరెస్టు చేయాలని కోరారు. నిందితుల ఫిర్యాదు మేరకు బాధిత కుటుంబంపైనే రూరల్ ఎస్ఐ అనిల్‌కుమార్ నమోదు చేసిన తప్పుడు కేసు రద్దు చేయాలని జిల్లా కలెక్టర్, ఎస్పీలకు విజ్ఞప్తి చేశారు. ఘటనపై బాధితులు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, నిందితులతో రాజీ చేసుకోవాలని రూరల్ ఎస్ఐ బాధితులను బెదిరించాడని తెలిపారు. బాధితులపై అక్రమ కేసు నమోదు చేసిన రూరల్ ఎస్ఐపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేఎన్‌పీఎస్ ఉపాధ్యక్షులు గొల్లపూడి చిన్న ప్రసాద్, కొయ్యలమూడి జయమ్మ, బయ్యవరపు సతీష్, నాగిపోగు శ్రీనివాసరావు, ప్రగతిశీల కార్మిక సమాఖ్య జిల్లా కమిటీ సభ్యులు కంబాల ఏడుకొండలు, ప్రజాకళామండలి రాష్ట్ర కోశాధికారి ఉన్నం నాగేశ్వరరావు, రాణితో పాటు వివిధ గ్రామాల్లోని ప్రజలు ధర్నాలో పాల్గొన్నారు.

ఎన్‌ఆర్‌ఐ కోటాలో దరఖాస్తుల ఆహ్వానం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ వర్సిటీ పరిధిలోని కళాశాలల్లో ఎన్‌ఆర్‌ఐ కోటాలో పలు కోర్సులకు దరఖాస్తులను రెండవ సారి ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ జి రామచంద్రరావు మంగళవారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గానూ బీఎస్సీ అగ్రికల్చర్, బీటెక్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్, బీటెక్ ఫుడ్ టెక్నాలజీ, బీఎస్సీ కమ్యూనిటీ సైన్స్ కోర్సుల్లో ప్రవేశాలకు ఎన్‌ఆర్‌ఐ కోటాలో ఈ నెల 28 నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు.

మహిళపై లైంగికదాడి, హత్య కేసులో నిందితుల అరెస్ట్

నాదెండ్ల: ఒంటరి మహిళపై లైంగికదాడి జరిపి దారుణంగా హత్య చేసిన నిందితులను మంగళవారం నాదెండ్ల పోలీసులు అరెస్టు చేశారు. చిలకలూరిపేట రూరల్ సీఐ బి.సుబ్బానాయుడు, ఎస్ఐ జి.పుల్లారావు విలేకరుల సమావేశంలో వివరాలు తెలిపారు. గణపవరం శివాలయం వీధిలో నివాసం ఉండే షేక్ మస్తాన్‌బీ (45) భర్త మరణించటంతో కొంతకాలంగా అదేవీధిలో ఉంటున్న పీర్లచావిడిలో నివాసం ఉంటోంది. ఒడిశా రాష్ట్రం, బద్రక్ జిల్లా, ఫతేపూర్ మండలం, లెంతార్ గ్రామానికి చెందిన మనోజ్‌మాలిక్ అలియాస్ రాజుమాలిక్ కొంతకాలంగా గణపవరంలోని రాజీవ్‌గాంధీ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ వివిధ పరిశ్రమల్లో ముఠా పనులకు వెళ్లేవాడు. అయితే అక్కడ అద్దె చెల్లించకపోవటంతో ఖాళీ చేయించారు. దీంతో తమ మేస్త్రీ గాజుల మేరయ్య సాయంతో పీర్లచావిడిలో ఉంటున్నాడు. ఈ నెల 8వ తేదిన అర్ధరాత్రి సమయంలో స్థానికంగా ఉండే ఎం.సాంబశివరావుతో కలిసి మద్యం, గంజాయి సేవించారు. రాజుమాలిక్ పీర్లచావిడీలోని మరో గదిలో నిద్రిస్తున్న మస్తాన్‌బీని చీరతో గొంతునులిమి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆపై హత్యచేసి పరారయ్యాడు. మంగళవారం రాజుమాలిక్, సాంబశివరావు ఇద్దరూ గణపవరం నుంచి నాదెండ్ల వెళ్లే డొంక రోడ్డులో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఇరువురినీ అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరిచారు. నిందితులను అరెస్టు చేయటంలో చాకచక్యంగా వ్యవహరించిన పోలీసు సిబ్బందిని సీఐ సుబ్బానాయుడు అభినందించారు.

అనుమానంతో భార్యను హతమార్చిన భర్త

పట్నంబజారు: అనుమానం పెనుభూతమై భార్యను భర్త హతమార్చిన ఘటన గుంటూరు నగరంలో చోటుచేసుకుంది. పాత గుంటూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత గుంటూరు రాఘవనగర్‌కు చెందిన అచ్చి అంకమ్మరావు అలియాస్ అభిరామ్ 11 సంవత్సరాల క్రితం మణిపురం ఒకటో లైనుకు చెందిన మాచవరపు మౌనిక (24)ను ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి ముగ్గురు సంతానం. అంకమ్మరావు నిత్యం మద్యం తాగొచ్చి అనుమానంతో ఆమెను వేధింపులకు గురిచేసేవాడు. ఈ నెల 26వ తేదీ రాత్రి కూడా తాగొచ్చి గొడవకు దిగాడు. క్రికెట్ బ్యాట్ తీసుకుని ఆమెను తలపై బలంగా కొట్టడంతో తీవ్ర రక్తస్రావమైంది. స్థానికులు గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మౌనిక మంగళవారం ఉదయం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. విషయం తెలుసుకున్న పాతగుంటూరు పోలీసు స్టేషన్ ఎస్‌హెచ్‌వో వై. వీరసోమయ్య ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మౌనిక తల్లి పార్వతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



మౌనిక మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్‌హెచ్‌ఓ వై.వీరసోమయ్య

భవిష్యత్‌లో అన్ని రంగాలపైనా ఏఐ ప్రభావం

జెన్ ఏఐ పయనీర్ సీఈవో దేసు ఉమా

గుంటూరు రూరల్: భవిష్యత్తులో ఏఐ అన్ని రంగాలను శాసించనుందని జెన్ ఏఐ పయనీర్ సంస్థ సీఈవో దేసు ఉమా తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో ప్రారంభించిన జెనెరేటివ్ ఏఐ ఎఫ్‌డీపీ వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మానవుడి మేధాశక్తి కన్నా, సాంకేతిక కృత్రిమ మేధకు శక్తి పది రెట్లు ఉంటుందని తెలిపారు. 2030 నాటికి 10 లక్షల మంది విద్యార్థులను ఏఐలో ఇంజినీరింగ్ నిపుణులుగా తయారు చేయడమే కేంద్ర ప్రభుత్వం లక్ష్యమని తెలిపారు. స్వల్ప కాలంలో మెరుగైన సత్ఫలితాలు ఏఐ టెక్నాలజీతోనే సాధ్యమని చెప్పారు. అన్ని రంగాలను ఏఐతో జత చేస్తూ సాంకేతిక సామర్థ్యంలో విప్లవాత్మక మార్పులను సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా ప్రపంచ వ్యాప్తంగా 2030 నాటికి కృత్రిమ మేధ ఉత్పత్తులు ఒక ట్రిలియన్‌కు చేరుకొనేలా ప్రముఖ అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ కంపెనీలు వారి నిపుణుల ద్వారా తీవ్ర పరిశోధనలు చేస్తున్నాయని వివరించారు. వీటిని దృష్టిలో ఉంచుకొని భారీ ప్యాకేజీలతో కూడిన ఉద్యోగ సాధన దిశగా కంపెనీల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తయారుచేసేందుకు అధ్యాపక బృందం సిద్ధమవ్వాలని కోరారు. విద్యార్థులను అన్నివిధాల భవిష్యత్తు సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేలా సిద్ధం చేయడమే తమ లక్ష్యమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు జాగర్లమూడి మురళీమోహన్, డాక్టర్ జగదీష్ కె.మద్దినేనిలు పేర్కొన్నారు. నిపుణులతో నిర్వహించే ఇలాంటి శిక్షణ తరగతులు విద్యార్థులకు అవసరమైన అత్యాధునిక సాంకేతిక విద్యను సులభతరంగా చేస్తాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎం. శ్రీలత, డాక్టర్ ఎ.నగేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న దేసు ఉమా